క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: స్థానిక చైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అగ్నిమాపక అధికారి బి.భీముడునాయక్ ఆధ్వర్యంలో గురువారం అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. గ్యాస్ సిలిండర్ లీకేజీ జరిగినప్పుడు ఏవిధంగా అరికట్టాలో చూపించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తాజుద్దీన్, అగ్నిమాపక సిబ్బంది కరిముల్లా, గౌస్, చాంద్, రషీద్, నాయక్, అన్సర్ పాల్గొన్నారు.

రైతులు పచ్చిరొట్ట ఎరువును ఉపయోగించండి



పచ్చిరొట్ట ఎరువు తయారీని పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారులు

ఆత్మకూరు: పంటల సాగులో పచ్చిరొట్ట ఎరువును వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని హార్టికల్చర్ అధికారులు నాగరాజు, మహబూబ్‌బాషా, సయ్యద్‌బాషా రైతులకు సూచించారు. శ్రీపతిరావుపేట గ్రామ పరిధిలో గురువారం పచ్చిరొట్ట ఎరువుల తయారీ విధానాన్ని వారు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఇన్‌చార్జ్ శశికళ, సిబ్బంది హనీఫ్‌బాషా, వరలక్ష్మి పాల్గొన్నారు.

రైతులు నష్టపోకూడదనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు

- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు: రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సివిల్ సప్లై అధికారులు ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈక్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించుకున్న రైతుల వద్ద నుంచే ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ, సర్పంచు మేకల భాగ్యమ్మ, మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, సివిల్ సప్లై డీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళా వేదికపై హైదరాబాద్‌కు చెందిన భాస్కర డాన్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గణపతి తాండవం, మహాగణపతిం, శివాష్టకం, శివతాండవం, చిదంబర స్తోత్రం, లింగాష్టకం, అయిగిరినందిని తదితర గీతాలకు, అష్టకాలకు సాత్విక, శ్రీశ్వేత, వేద, సాహితి, అక్షయ, మనస్వి, భవ్య, యోగిత తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవు

కొత్తపల్లి: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఆర్.జయశేఖర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని సిద్ధేశ్వరం నీటి ముంపు భూముల వద్ద స్థానిక, స్థానికేత భూ నిర్వాసితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం భూములపై 145 సెక్షన్ అమల్లో ఉందన్నారు. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా వాటిలోకి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

నంద్యాల (వ్యవసాయం): డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నంద్యాల డిపోలో డిపో కార్యదర్శి పి.సుబ్బరాజు ఆధ్వర్యంలో గేట్ ధర్నా చేశారు. నాయకులు నరసింహులు, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అర్హులకు పదోన్నతులు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే త్వరలో ప్రవేశపెట్టబోతున్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నడిపించాలన్నారు. పాత ఈహెచ్ఎస్ విధానాన్ని అమలు పరచాలని కోరారు. అదే విధంగా అలవెన్స్, బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ డ్రైవర్లకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నందీశ్వరుడు, ఏడుకొండలు, చౌరెడ్డి, రఫీ, సుబ్బారావు, రమణ, వలి, తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన చికెన్ ధరలు

- మాంసం ధరలూ అంతే..
- ఆందోళనలో పేద, మధ్య తరగతి ప్రజలు



ఫారంలో ఉన్న మేకలు

ఆత్మకూరు: ఇటీవల పర్వదినాలు, శుభకార్యాలు ఒకే సారి రావడంతో చికెన్ ధరలు కొండెక్కాయి. కేవలం రెండు వారాల వ్యవధిలోనే ఊహించని విధంగా పెరిగాయి. ఉగాది, రంజాన్ పర్వదినాల సందర్భంగా చికెన్ కిలో ఉన్నఫలంగా రూ.300 దాకా అమ్మకాలు జరిగాయి. శివరాత్రి కంటే ముందు కిలో చికెన్ రూ.180 నుంచి రూ.200 మించలేదు. ఆ తర్వాత ఉన్నఫలంగా ఊహించని విధంగా ధరలు పెరగడంతో మాంసం ప్రియులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క చికెన్ విక్రయదారులు ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారనే ఆరోపణలున్నాయి. చికెన్ ధర ఊహించని విధంగా పెరగడంతో మాంసం ప్రియులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి నందికొట్కూరు, జూపాడుబంగ్లాలో చికెన్ విక్రయాలను పరిశీలిస్తే చాలా వరకు ధరలు తక్కువగానే ఉంటున్నాయి. కానీ ఆత్మకూరులో మాత్రం అధిక ధరకు విక్రయిస్తుండటం పట్లు ఇక్కడి వ్యాపారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పండుగలు, పర్వదినాల సమయంలో ధరల పెంపు మరింత అధికంగా ఉంటుండటంతో పేద, మధ్య తరగతి వర్గాలు మాంసాహారానికి దూరం కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

పొట్టేళ్ల ధర తగ్గినా.. దిగిరాని మాంసం ధరలు

ఆత్మకూరులో ప్రతి శనివారం మేకలు, పొట్టేళ్ల అమ్మకాల సంత జరుగుతోంది. ఆత్మకూరుతో పాటూ వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాలకు చెందిన ప్రజలు కూడా ఇక్కడికే వచ్చి పొట్టేళ్లు, మేకల కొనుగోలు చేస్తుంటారు. రెండు వారాలుగా ఆత్మకూరు సంతమార్కెట్‌లో వీటి ధరలు గణనీయంగా తగ్గాయి. 25 నుంచి 30 కిలోల పొట్టేలు ధర రూ.15 వేల నుంచి 16 వేలలోపు మాత్రమే పలుకుతున్నాయి. 15 నుంచి 20 కిలో మాంసం లభించే పొట్టేళ్లు రూ.7 వేల నుంచి రూ.10 వేల లోపు మాత్రమే అమ్ముడుపోతున్నాయి. కానీ వాటి మాంసం ధరలను మాత్రం వ్యాపారులు తగ్గించడం లేదు.



ఆత్మకూరు చికెన్ దుకాణంలో కోళ్లు

ధరల పెరుగుదలను నియంత్రించాలి



చికెన్ ధరలు ఇష్టానుసారం పెంచడం తగదు. అధికారుల పర్యవేక్షణ లేకే వ్యాపారులు ఇలా పెంచుతూ పోతున్నారు. వేసవి వస్తే కోళ్ల మృత్యువాత పడటం సహజం. అలాంటప్పుడు ధరలు తగ్గాలి. కానీ ఇక్కడ పెంచుతూనే ఉన్నారు. ధరల పెరుగుదలపై అధికారులు దృష్టిసారించి నియంత్రించాలి.

– శివశంకర్‌నాయక్, తండా

భారీగా పెరిగిన చికెన్ ధరలు



రెండు వారాల క్రితం కిలో రూ.200 లకు అమ్మిన చికెన్ దుకాణదారులు.. ప్రస్తుతం రూ.300లకు విక్రయిస్తున్నారు. ఆదివారం వచ్చిందంటే మాంసాహారం తినాలని ఆశపడే పేద, మధ్య తరగతి ప్రజలకు ధరలను చూసి మానుకునే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి ధరలు తగ్గించాలి.

– వెంకటేశ్వర్లు, ఆత్మకూరు

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



పూజలందుకున్న దత్తాత్రేయస్వామి

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి దేవస్థానం అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ఎస్సీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలానికి 13 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. 21 నుంచి 50 ఏళ్లలోపు ఎస్సీలు అర్హులన్నారు. రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో మే 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కళ తప్పిన జాతర

అరకొరగా వృషభాల క్రయవిక్రయాలు



తర్తూరు జాతరుతో పలుచగా కనిపిస్తున్న ఎద్దులు

జూపాడుబంగ్లా: ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా యంత్రాలతో సేద్యం చేయటంతోపాటు అటవీశాఖ అధికారులు కలప విక్రయాలను నిషేధించటంతో రైతన్నలకు పేరొందిన తర్తూరు జాతరలో ఏటేటా కలప, ఎద్దుల విక్రయాలు తగ్గిపోతున్నాయి. ఈ ఏడాది తర్తూరు జాతరకు ఆశించిన స్థాయిలో ఎద్దులు రాకపోవటం.. అరకొరగా వచ్చిన ఎద్దుల ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో కొనుగోలు కోసం వచ్చిన రైతన్నలు నిరాశతో వెనుదిరిగారు. కలప వ్యవసాయ పరికరాలు లభించకపోవటం, ఎద్దుల పోషణభారం అధికం కావటం, గిట్టుబాటు ధరలు లభించకపోవటం వంటి పలు కారణాల వల్ల కొంత మంది రైతులు వ్యవసాయాన్ని వదులుకుంటూ ఎద్దులను విక్రయించటానికి జాతరకు వచ్చినట్లు చెబుతున్నారు. కొత్తగా వ్యవసాయం ప్రారంభించేందుకు ఎద్దులను కొనాలని వచ్చిన వారికి వాటి ధరలు రూ. 80 నుంచి రూ.1.20 లక్షలు పలుకుతుండటంతో అంత ఆర్థిక స్తోమత లేదంటూ వెనుదిరిగారు.

సదరం క్యాంపు శ్రీశైలంలోనే నిర్వహించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న మల్లికార్జున

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని దివ్యాంగులకు శ్రీశైలంలోనే సదరం క్యాంపు ఏర్పాటు చేయాలని దివ్యాంగుల సంఘం నాయకులు నల్లబోతుల మల్లికార్జున గురువారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు. శ్రీశైలం మండలం జిల్లా కేంద్రానికి సుమారు 200 కిలో మీటర్ల దూరంలో ఉందని, దివ్యాంగులు అంతదూరం వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తిరుగుప్రయాణంలో అటవీశాఖ చెక్‌పోస్టులు రాత్రివేళల్లో మూసివేయడంతో మరో రోజు అక్కడే ఉండిపోవాల్సి వస్తుందని ఆయన డీటీకి వివరించారు.

మార్కులే భవిష్యత్‌ను నిర్దేశించవు



విద్యార్థులకు అవగానకల్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మార్కులే విద్యార్థుల భవిష్యత్‌ను నిర్దేశించలేవని జిల్లా సమగ్ర శిక్ష, గర్ల్, చైల్డ్ డెవల్‌మెంట్ అధికారి నాగసువశ్చల సూచించారు. గురువారం స్థానిక కేజీబీవీలో ప్రిన్సిపాల్ కృష్ణాబాయి అధ్యక్షతన విద్యార్థినులకు «పరీక్షలు, మార్కులే జీవితమా» అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీసీడీఓ మాట్లాడుతూ జ్ఞానసంపాదన, క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల వంటి లక్షణాలు జీవిత విజయానికి కీలకమన్నారు. అభిరుచులు, సామర్థ్యాలను అంచనా వేసుకుని కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆశించిన స్థాయిలో మార్కులు రాకపోయినా ఒత్తిడికి గురికాకుండా బాగా కృషిచేసి విజయం సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీరామ్, నాగన్న, సునీత పాల్గొన్నారు.

రేపు పూర్వ విద్యార్థుల సమావేశం

నందికొట్కూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈనెల 19న నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు శ్రీరామ థియేటర్ యజమాని ఎం. రామిరెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి పూర్వ విద్యార్థులు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి

పాములపాడు: సామాజిక, చైతన్య సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా నాయకుడు మేకల రాజు కోరారు. గురువారం మండల కేంద్రంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఈనెల 27 నుంచి అంబేడ్కర్ నాటక ప్రదర్శనలు నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రత్నమయ్య, ఏసన్న, నాగరాజు, ఈశ్వరయ్య, మోసే పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే బలం

– ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: పార్టీకి కార్యకర్తలే అండ అని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన శ్రీశైల నియోజకవర్గం టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఏ కార్యకర్త కూడా నిరుత్సాహ పడొద్దన్నారు. శ్రీశైలం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమన్నారు. శ్రీశైలం, మహానంది పుణ్యక్షేత్రాలను టెంపుల్ కారిడార్ ఏర్పాటుతో టూరిజాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. తెలుగంగ, కేసీ కెనాల్, సిద్ధాపురం చెరువుల నుంచి రైతులకు రెండు పంటలకు సాగునీరు అందిస్తామన్నారు. ఆత్మకూరు, వెలుగోడు పట్టణాల్లో ఇంటింటికి తాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

మట్టి నమూనా సేకరణ పూర్తి చేయాలి



మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాములపాడు: మట్టి నమూనా సేకరణలు మే 15లోపు పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారిణి హేమలత సూచించారు. గురువారం రైతు సేవా కేంద్రం సిబ్బంది మట్టి నమూనా సేకరణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి 15 హెక్టార్లకు ఒక నమూనా సేకరించాలన్నారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది జీపీఎస్ కో ఆర్డినేట్లు ఎలాంటి మార్పుల్లేకుండా కచ్చితంగా నమోదు చేయాలన్నారు. మట్టి నమూనా సేకరించే సమయంలో రైతుతో కలిసి సెల్ఫీ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దుర్గా చరణ్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి

నంద్యాల(న్యూటౌన్): వివిధ ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు డిగ్రీ ఆ పై విద్యార్హత కలిగిన విద్యార్థులు సన్నద్ధం కావాలని సెట్కూరు సీఈవో వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూ ఏసీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్కూరు సహకారంతో కేంద్ర, రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాల అర్హత, వయోపరిమితి, సిలబస్ పరీక్ష విధానం మొదలైన వాటిపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శశికళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెట్కూరు సీఈవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే ప్రణాళిక రచించుకోవాలన్నారు. మొదటి ప్రయత్నంలో విజయం సాధించకపోయినా ప్రయత్నిస్తూ ఉండాలన్నారు. ఉపాధి కల్పన అధికారి సోమశివారెడ్డి మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వెంటనే విద్యార్థులు ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో రిజిష్టర్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ పార్వతి, అధ్యాపకులు రమేష్‌కుమార్, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ

ఉయ్యాలవాడ : ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు, రైతులకు తెలియజేయవలసిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి విపత్తుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. గత మూడు రోజులుగా వివిధ శాఖల అధికారులతో ప్రకృతి వైపరీత్యాలతో అతివృష్టి, అనావృష్టిలతో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నపుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వేసవి కాలంలో భూకంపాలు, అగ్ని ప్రమాదాలు అధికంగా చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వాటిని అరికట్టాలనానరు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, పశు వైద్యాధికారిణి నాగశైలజ, వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జనాభా లెక్కల ప్రకారం నిధులు మంజూరు చేయండి

కర్నూలు(అర్బన్): ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు విడుదల చేయాలని కొత్తపల్లి జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, డోన్ ఎంపీపీ రేగడి రాజశేఖర్‌రెడ్డి కోరారు. గురువారం వారు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన జెడ్పీటీసీ, ఎంపీపీల తరుపున తిరుపతిలో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలోనే వారు 16వ ఆర్థిక సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ పనగరియను కలిసి ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రం అందించారు. సమావేశంలో పీఆర్అండ్ ఆర్డీ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ పాల్గొన్నారు.

రిటైర్డ్ ముఖ్య అర్చకుడి మృతి

మహానంది: మహానంది దేవస్థానంలో ముఖ్య అర్చకుడిగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన బేతన భట్ల లక్ష్మీనరసింహ శాస్త్రి అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. ఈఓ శ్రీనివాసుల రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఏఈఓ మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి, వేద పండితులు రవి శంకర్ అవధాని తదితరులు నరసింహ శాస్త్రి మృత దేహానికి నివాళులర్పించి, అంత్యక్రియల నిమిత్తం రూ.25 వేల నగదును కుటుంబ సభ్యులకు అందించారు.

19న జిల్లాస్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19వ తేదీన నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ రవిక్రిష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నెరవాటి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 7,9 సంవత్సరాలలోపు బాల, బాలికలు రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనేందుకు జిల్లా జట్లను ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 18వతేది సాయంత్రం 6గంటలలోపు ఏపీ చెస్‌వెబ్‌సైట్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 90104 51585 నంబర్లను సంప్రదించాలన్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జూపాడుబంగ్లా: తర్తూరు గ్రామ అంచెవద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం తర్తూరు అంచెవద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు–గుంటూరు నేషనల్ హైవే 340సీ రోడ్డుపై తర్తూరు వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించకపోవటంతో జాతరకు వస్తున్న వేలాది మంది భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కేజీ రోడ్డుకు అనుసంధానంగా అండర్‌పాస్ వంతెన నిర్మింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్ ఉస్మాన్‌బాషా, అబ్దుల్‌రషీద్, దూదేకుల బాబు, ఆర్ఎంపీ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బడిఈడు పిల్లలు

- అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం

నంద్యాల: జిల్లాలో బడిఈడు పిల్లలను గుర్తించి ఈనెల 21లోపు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఎంఈఓలు, తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లు, ఐడీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆర్డీఓలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ రాము నాయక్, ఆత్మకూరు ఆర్డీఓ అరుణజ్యోతి, డీఈఓ జనార్దన్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జీఓ 117 ప్రకారం పాఠశాలలు సర్దుబాటు చేయడంతో కొంత మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రైవేటు పాఠశాలల్లో చేరారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆ జీఓలో సవరణలు చేసిందన్నారు. దీంతో బడిఈడు పిల్లలందరినీ సర్కారు బడుల్లో చేర్పాలన్నారు. ఒకటో తరగతిలో చేరాలనుకున్న అంగన్‌వాడీ పిల్లలను గుర్తించాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంఈఓలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్య, భోజనం తదితర సదుపాయాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

ఈనెల 22 వరకు పోషణ్ పక్వాడ ఉత్సవాలు

ఏప్రిల్ 8వ తేది నుంచి ఈనెల 22వ తేది వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషణ్ పక్వాడ ద్వారా పౌష్టిక ఆహారం అందిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. దీని వల్ల రక్తహీనత, ఎదుగుదల లోపం, అనీమియా సమస్యలు ఉండవని అన్నారు. మునగాకు తినడం వల్ల రక్తహీనతను అధిగమించవచ్చునని చెప్పారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

స్వర్ణాంధ్ర– స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చెత్త చెదారం తొలగింపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు వివరించారు. గురువారం ఉదయం విజయవాడ నుంచి సీఎస్ ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, తాగునీటి సరఫరా, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్ఎమ్ఈల సర్వే, నియోజకవర్గాల్లో ఎంఎస్ఎమ్ఈ పార్కుల ఏర్పాటు, స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం కలెక్టర్ స్థానిక అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు.

గ్రామీణ, మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో చెత్తాచెదారం తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈనెల 19న మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ నెలలో 'ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్' (ఈ వేస్ట్ రీసైక్లింగ్) అంశంతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందని చెప్పారు. తడి, పొడి చెత్తపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పశువులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జగన్‌మోహన్

బండిఆత్మకూరు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు గురువారం ఎస్ఐ జగన్ మోహన్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, వాట్సాప్‌లలో వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దని సూచించారు. అనంతరం 1930, 100, 112 నంబర్ల ప్రాముఖ్యతను వివరించారు.

20న విగ్రహాల ప్రతిష్ఠ

నందికొట్కూరు: మిడుతూరులో వరసిద్ధి వినాయక సహిత వీరాంజనేయ సహిత, లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాలు నిర్మించారు. అందులో భాగంగా వరసిద్ధి వినాయక సహిత వీరాంజనేయ సహిత, లక్ష్మీచెన్నకేశవస్వామి విగ్రహాలను ఈనెల 20న ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు.